క్లుప్తంగా

ఘనంగా కర్రెమ్మ దేవత బోనాలు



మరికల్: మండల కేంద్రంలో గ్రామస్తులు మంగళవారం ఘనంగా కర్రెమ్మ బోనాల వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. బోనాలతో వచ్చిన మహిళలు అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు గ్రామస్తులకు అన్నదానం నిర్వహించారు.

బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలి

మరికల్: మండలంలోని పలు గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అధిక ధరలకు మద్యం అమ్ముతున్న బెల్ట్‌షాప్‌ల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు పల్లెగడ్డ హన్మంతు మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. అధిక ధరలకు మద్యం అమ్ముతు కాసులు కళ్ల చూస్తున్న బెల్ట్ షాప్‌లపై తక్షణమే ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలతనిఖీ



ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లి యూపీఎస్ పాఠశాలను మంగళవారం ఎంఈఓ వెంకటయ్య ఆకస్మికంగా తనిఖీచేశారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్నభోజనాన్ని విద్యార్థులకు మెనూప్రకారం వడ్డించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింగప్ప, ఉపాధ్యాయులు కృష్ణ, అహ్మద్, శ్రవంతి పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా అర్షద్ అలీ



మక్తల్: మండలంలోని నూతన సబ్‌రిజిస్ట్రార్ అధికారిగా అర్షద్ ఆలీ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన అనంద్ ప్రసాద్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో అర్షద్ ఆలీ పదవీ బాధ్యతలు చేట్టారు. వారికి శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో హసన్, దిల్దార్, రవికుమార్, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్మోగిన హనుమాన్ నామస్మరణ

నారాయణపేట రూరల్: పట్టణంలోని సాయి విజయకాలనీలోని తోట్ల హనుమాన్ ఆలయంలో మంగళవారం స్వామివారి పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివా రి మూలవిరాట్‌కు అభిషేకం, సిందూరలేపనం, హనుమాన్ అష్టోత్తరం, పుష్పాలంకరణ, భజన, నైవేద్యం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించి తీర్థప్రసాద వితరణ చేశారు. మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

6న విస్తృతస్థాయి సమావేశం

మహబూబ్‌నగర్ రూరల్: జాతీయ మాల మహానాడు తెలంగాణ విస్తృత స్థాయి సమావేశం ఈనెల 6న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి బ్యాగరి వెంకటస్వామి తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు చిన్న, ఉపాధ్యక్షుడు సత్యయ్య, ప్రధాన కార్యదర్శి అరేందర్, కోశాధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి



స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఫయాజ్ అల్మాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఫయాజ్, ఇతర నాయకులు కేక్‌కట్ చేశారు. విభాగం అసెంబ్లీ అధ్యక్షుడు ఫక్రుద్దీన్ ఖురేషి, పట్టణ అధ్యక్షుడు గులాం దస్తగీర్ జహీర్, నాయకులు షాఫైసల్, పీర్ సాధిక్, అలీం, ఫహిం, తాహెర్, మూసా చావుష్, అలీ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన



అప్పిరెడ్డిపల్లి లో దరఖాస్తులు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

నారాయణపేట రూరల్: మండలంలో మంగళవారం ఆరు గ్రామాల్లో చేపట్టగా 2579 కుటుంబాలు 3738 దరఖాస్తులను అధికారులకు అందించారు. ఇప్పటి వరకు మండలంలో 11,228 దరఖాస్తులు అందుకున్నారు. శేర్నపల్లిలో 629, చిన్నజట్రంలో 474, అప్పిరెడ్డిపల్లిలో 697, అభంగాపూర్‌లో 656, మేకహన్మాన్‌తండాలో 190, ఊటకుంటతండాలో 185 దరఖాస్తులు వచ్చాయి. ఆయా జీపీల్లో ఎంపీడీఓ వెంకటయ్య, తహసీల్దార్ రాణాప్రతాప్, వ్యవసాయశాఖ అధికారి శరత్‌చంద్ర, డిప్యూటీ తహసీల్దార్ నారాయణ, ఎంపీఓ బాలాజీలు పర్యవేక్షించారు.

నర్వ: గతకొన్ని రోజులుగా ప్రజాపాలన కార్యక్రమం మండలంలో ముమ్మరంగా కొనసాగుతుంది. మంగళవారం ఉందేకోడ్, జంగంరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరించారు. ఆయా గ్రామాల్లో మండల ప్రజాపాలన అధికారులు ఎంపీడీఓ సుదర్శన్, తహసీల్దార్ మల్లారెడ్డి స్థానిక సర్పంచ్‌లు నెల్లూరి పావని, రాములు, ఎంపీటీసీలు నీరజలతో కలిసి ప్రారంభించారు. సాయంత్రం వరకు కొనసాగిన కార్యక్రమంలో ఉందేకోడ్‌లో 1248, జంగంరెడ్డిపల్లిలో 408మొత్తం 1656 దరఖాస్తులు వచ్చినట్లు ప్రత్యేక అధికారి డీఎల్‌పీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తులు సజావుగా కొనసాగేటట్లు ఎస్‌ఐ కురుమయ్య, ఏఎస్‌ఐ రాజేష్ బందోబస్తు నిర్వహించారు.

మద్దూరు: ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, వైస్ఎంపీపీ వెంకట్‌రెడ్డి ప్రజలకు సూచించారు. బుధవారం మండలంలోని అప్పిరెడ్డిపల్లి 373, చెన్నారెడ్డిపల్లి 357, చింతల్‌దిన్నే 340, దమ్‌గాన్‌పూర్ 520, కొత్తపల్లి 393 దరఖాస్తులను అధికారులు దరఖాస్తుల స్వీకరించారు. 19 గ్రామాల్లో కలిపి ప్రజాపాలన దరఖాస్తులు 2,692: ఇతర దరఖాస్తులు 1,037 వచ్చినట్లు . ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

మాగనూర్: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం మంగళవారం మండలంలోని ఓబ్లాపూర్, తళంకేరి, అమ్మపల్లి, పర్మన్‌దొడ్డి గ్రామంలో అధికారులు ప్రారంభించారు. ఓబ్లాపూర్‌లో సర్పంచ్ నారాయణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు దరఖాస్తులను స్వీకరించినట్లు మండల స్పెషల్ అధికారి కృష్ణచారి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శశికళ, తహసీల్దార్ సతీష్‌కుమార్, డీటీ అమీర్, వైస్ ఎంపీపీ తిప్పయ్య, ఎంపీవో జైపాల్ రెడ్డి, ఆర్ఐ శ్రీశైలం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు ఆనంద్‌గౌడ్, వాకిటి శ్రీనివాసులు, ఆంజనేయులు, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలోని మంగళవారం 16వార్డులలో 1650 దరఖాస్తులు వచ్చాయని కమిషనర్ బాల్‌రాం నాయక్ తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ పావని, వైస్ చైర్మన్ అఖిలరెడ్డి, కౌన్సిలర్లు స్వేతా రెడ్డి, అర్చన, మొగులప్ప, కొండయ్య, సత్యనారాయణ, రాములు, శంశోద్దీన్ పాల్గొన్నారు.



మక్తల్‌లో..



నర్వలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు



మద్దూర్‌లో..

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రతో అవగాహన



సంకల్పయాత్రలో పాల్గొన్న ప్రజలు, అధికారులు

నర్వ: కేంద్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఎఫ్ఎల్‌సీ సురేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజలకు ఎల్ఈడీ తెర, డ్రోన్‌ల ద్వారా కేంద్రప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ప్రజల చేత పథకాల సద్వినియోగం, స్వచ్ఛభారత్ కార్యక్రమాలపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వ పథకాలపై బ్రోచర్‌లను, క్యాలెండర్‌లను ప్రజలకు అందించారు. అనంతరం జాతీయ బ్యాంకుల ద్వారా ప్రభుత్వం అందించే వివిధ ఇన్సూరెన్స్ పథకాలను ఏపీజీవీబీ ఫీల్డ్‌ఆఫీసర్ శ్రావణ్ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీఎల్ఓ అయ్యన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్‌లో జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పోలీస్ కళాబృందం వారు బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, సైబర్‌నేరాలు, సెల్‌ఫోన్ అతిగా వినియోగించడంతో ఏర్పడే అనార్థాలు, రోడ్డు భద్రతా నియమాలు, మహిళలపై వేదింపులు తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సందెరాళ్ల పోటీలు



బరువు ఎత్తి ప్రారంభిస్తున్న మహేష్

నర్వ: మండలంలోని పెద్దకడ్మూర్‌లో మంగళవారం యువకులు ఎంతో ఉత్సాహంగా సందెపురాళ్ల పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మంగలి రాములు స్మారకార్థం కుమారుడు మహేష్ నిర్వహించిన ఈ సందెపురాళ్ల పోటీల్లో వివిధ మండలాల నుంచి సందెపురాళ్ల ఔత్సాహికులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. క్వింటాల్ బరువు నుంచి ఇతర బరువులను ఎత్తే ఈ పోటీల్లో క్రీడాకారులు పోటీపడి బరువులు ఎత్తారు. ఈ సందర్భంగా పోటీలను నిర్వహించిన ఔత్సాహికుడు మహేష్‌ను గ్రామస్తులు అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతి అందజేశారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలని వినతి

మరికల్: కంపెనీ ఎత్తివేత ఆందోళన కార్యక్రమంలో పోలీసులు, గ్రామస్తుల మధ్యన జరిగిన ఘర్షణలో గ్రామస్తులపై పెట్టిన అక్రమకేసులను ఎత్తివేయాలని ప్రజాపాలనకు వచ్చిన ప్రత్యేక అధికారి శ్రీనివాసులుకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం ఎక్లాస్‌పూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన అధికారులతో వారు మాట్లాడుతూ.. పోలీసులు, గ్రామస్తుల మధ్యన జరిగిన గొడవలో ఎక్లాస్‌పూర్‌కిచెందిన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వారం రోజుల క్రితం మృతి చెందారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వారు కోరారు.

పాఠశాలలో కనీస వసతులు కల్పించాలి

అమరచింత: ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు తరగతి గదుల్లో మౌలిక వసతులు కల్పించి, పౌష్టికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహ కార్యదర్శి రాఘవ డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఎస్ఎఫ్ఐ బృందం సందర్శించింది. ఈమేరకు పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట ఏజెన్సీ మహిళలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా అధికారులు చొరవ చూపాలన్నారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన భోజనశాల భవన నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని, గత ప్రభుత్వం అనుసరించిన తప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం చేయకుండా నిధులు మంజూరు చేయాలని కోరారు. మన ఊరు–మన బడి ద్వారా మంజూరైన పనులను చేపట్టి విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మహేందర్, అశోక్, ప్రశాంతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మిర్చి పంటకు వైరస్ ముప్పు

- సంరక్షణకు సస్యరక్షణ అవసరం
- పంటలనే ఆశిస్తున్న బూడిద, కాయకుళ్లు తెగుళ్లు
- పంటల సంరక్షణలో రైతన్నలు



కంసాన్‌పల్లిలో మిర్చి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి

దామరగిద్ద: మిర్చిపంటకు సోకుతున్న తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు. మండలంలోని బాపన్‌పల్లి, కాన్‌కుర్తి, కంసాన్‌పల్లి, క్యాతన్‌పల్లి తదితర గ్రామాల్లో రైతులు మిర్చిపంటను సాగుచేసినట్లు తెలిపారు. చలి వాతావరణ పరిస్థితులతో మిర్చిపంటకు బూడిద, కాయకుళ్ల తెగుళ్ల పురుగులు ఆశిస్తున్నాయన్నారు. నివారణకు ఆజాక్సిస్ట్రోబిన్, లేదా మైక్లోబుటనిల్ లేదా టెబ్యుకొనజోల్ 1ఎంల్, 1 లీటరు నీటిలో కలిపి వారం రోజు వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలని తెలిపారు.

జెమిని వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలి

మిరప పంటను ఆశిస్తున్న ప్రధానమైన జెమిని వైరస్ నివారణకు రైతులు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

నివారణ చర్యలు

- పంట పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూడాలి.
- వైరస్ సోకిన మొక్కలను పీకి నాశనం చేయాలి
- ఎకరాలకు 20.25 పసుపు రంగు జిగురు అట్టలను అమర్చాలి.
- పైరిప్రాక్సిపెన్+పెన్‌ప్రాపాతిన్ 1 మిల్లీ లీటరు, లేదా ఇమిడాక్లోప్రిడ్+ పిప్రొనిల్ 4మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- మిరపలో నల్ల తామర పురుగు నివారణకు స్పైనొషాడ్ అనే మందును 0.25 ఎంల్, లేదా డైఫెంతురాన్ లేదా అజాడిరక్టన్ 5ఎంల్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.
- పొగాకు లద్దెపురుగు నివారణకు క్లోరాంటనిలిప్రొల్ 3ఎంల్, 4 గ్రాం లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

రైతులు జాగ్రత్తలు పాటించాలి



చలి వాతావరణ పరిస్థితులతో మిర్చి పంటకు బూడిద, కాయకుళ్ల తెగుళ్ల పురుగులు ఆశిస్తాయి. మిర్చి పంట సాగుచేసిన రైతులు సలహాలు సూచనలు పాటించాలి. నివారణకు ఆజాక్సిస్ట్రోబిన్, లేదా మైక్లోబుటనిల్ లేదా టెబ్యుకొనజోల్ 1 ఎంల్, 1 లీటరు నీటిలో కలిపి వారం రోజు వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలి. వ్యవసాయ అధికారుల సలహాలు పొంది పంటను సంక్షించుకోవాలి

– ప్రదీప్ కుమార్, మండల వ్యవసాయ అధికారి

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మక్తల్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాకిటి

మక్తల్: కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే గ్రామాలు అభివృద్ధికి సాధ్యమయ్యాయని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం మండలంలోని మండలం పంచదేవ్‌పాడు, కాట్రెవ్‌పల్లి, గుడిగండ్ల, పంచలింగాల, భగవాన్‌పల్లి తదితర గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్నారు. ఒకే దరఖాస్తులు రైతు భరోసా, మహాలక్ష్మి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని కాట్రెవ్‌పల్లి 447, రేషన్ కార్డుల కోసం 103 ప్రతి మండలంలో కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలోని మొత్తం 2,150, దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జాన్‌సుధాకర్, ఎంపీపీ వనజ, తహసీల్దార్ సువర్ణరాజు, ఎంపీడీఓ సద్గుణ, ఎంపీఓ రహిమతుల్లా, సర్పంచ్ కల్పన, గుడిగండ్ల సర్పంచ్ మహేశ్వరి, తిక్కమ్మ, ఎంపీటీసీలు లక్ష్మి, నర్సిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని గుర్జాల్, కుసుమర్తి, మురహర్‌దొడ్డి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన ప్రజాపాలనలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అలాగే మండలంలోని గుర్జాల్‌లో ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడారు.. త్వరలోనే ఈ పాఠశాలకు నూతన భవవాన్ని మంజూరు చేయిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ యశోద, తహసీల్దార్ దయాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, చక్రపాణి, పంచాయతీ కార్యదర్శులు తిమ్మప్ప, నర్సింహారెడ్డి, శివరాంరెడ్డి, ఆనంద్‌గౌడ్, పల్లె సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మ తల్లి జాతర



మద్దెల్‌బీడ్‌లో బోనాల ఉత్సవాలు

దామరగిద్ద: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మైసమ్మ తల్లి జాతర ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు హోమం నిర్వహించారు. సామూహిక బోనాల ఉత్సవాలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్దెల్‌బీడ్‌లో..

మండలంలోని మద్దెల్‌బీడ్ ప్రధాన రహదారి పక్కన మైసమ్మతల్లి జాతర ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామం నుంచి మహిళలు సామూహిక బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కోళ్లు మేకలను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామపెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

జీఓ 46ను సవరించాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న యువకులు

నారాయణపేట రూరల్: గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన జీఓ 46ని వెంటనే సవరించాలని కోరుతూ టీఎస్ఎస్‌పీ అభ్యర్థులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజాపాలనలో భాగంగా ఎంపీడీఓ వెంకటయ్యకు వినతిపత్రం అందించి మాట్లాడారు. టీఎస్ఎస్‌పీ ఫలితాల విడదల సమయంలో కేడర్–1, 2 ఇస్తామని ప్రకటించి జిల్లా యూనిట్‌గా ప్రకటించడం సరికాదన్నారు. గ్రేటర్ హైద్రాబాద్ ప్రాంతానికి 53శాతం పోస్టులను కేటాయించడంతో తక్కువ మార్కులు వచ్చినా ఉద్యోగాలు వస్తున్నాయని, గ్రామీణ ప్రాంతాల వారికి నష్టం జరిగిందని వాపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సరి చేస్తామనే హామి నేరవేర్చాలని సీఎం రేవంత్‌ను విజ్ఞప్తి చేశారు.

వీఆర్ఓకు సన్మానం

మహబూబ్‌నగర్ రూరల్: గ్రామ రెవెన్యూ అధికారిగా 24 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన సవాళ్ల మణయ్యను మాల మహానాడు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డు గాంధీనగర్‌లో ప్రజాపాలనలో భాగంగా వార్డు ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయనను పీసీసీ సభ్యుడు బాబర్ అలీ సమక్షంలో పూలమాలలతో సత్కరించారు. మాల మహానాడు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు యాదయ్య, అలీం షకీబ్, శైలజ, రిసోర్స్ పర్సన్ మంజుల పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయించండి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ అధికారుల కోసం నడిచే అద్దె వాహనాల పెండింగ్ బిల్లులను విడుదల చేయించి ఆదుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని ఫోర్ వీలర్స్ డ్రైవర్స్ హైర్ వెహికిల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ తదితరులు కోరారు. మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వివరించారు. రవి, రమేష్, కిషోర్, సాజిద్ పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్



గుటిపల్లిలో బడిబయటి పిల్లలను పాఠశాలలో చేర్పిస్తున్న సీఆర్పీ సౌమ్యరాణి

ఆత్మకూర్: బడి మధ్యలో మానేసిన పిల్లలను పనులకు కాకుండా బడులకు పంపాలని ఎంఈఓ భాస్కర్‌సింగ్ కోరారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో బడిబయట పిల్లల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తే వారికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు ఉచిత యూనిఫాం, మధ్యాహ్నం భోజనం, పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా సీఆర్పీ సౌమ్యరాణి ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించారు. చదువు ప్రాముఖ్యతను వివరిస్తు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

రాములోరి అక్షతల ఊరేగింపు



ఆత్మకూర్‌లో అక్షతలను ఊరేగిస్తున్న వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ నాయకులు

ఆత్మకూర్: అయోధ్యలో నూతన రామమందిర ప్రారంభోత్సవం సందర్భంగా రామమందిర ట్రస్ట్ పంపిన అక్షతలకు మంగళవారం పట్టణంలో ఊరేగింపు నిర్వహించి ఇంటింటికీ పంచిపెట్టారు. స్థానిక నేతాజీనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం అఖండ జ్యోతిని వెలిగించారు. 2024 జనవరి 22న అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగే సందర్భంగా ఇళ్లల్లో పూజలు నిర్వహించేందుకు అక్షతలు అందజేస్తున్నట్లు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ నాయకులు అశ్విన్ కుమార్, తమ్మలి విజయ్, మ్యాడం శ్రీను, నర్సింహారెడ్డి తెలిపారు. అక్షతలను మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో ఇంటింటికీ చేరవేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కొండాపురం రాము, కిషోర్, వెంకటేష్, లింగన్న, బాలకృష్ణ, బాలు తదితరులు ఉన్నారు.

నర్వ: మండలంలోని పాథర్చేడ్‌లో మంగళవారం శ్రీరాముడి అక్షతల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్య శ్రీరామ పూజిత అక్షతలను ఇంటింటికీ అందించేందుకు జనజాగరణ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ నెల 22న, భవ్య రామమందిర ప్రారంభం సందర్భంగా నిర్వహించే ప్రతి ఒక్కరూ వీక్షించాలని కరపత్రాలు ఇంటింటికీ అందించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.



నర్వలో..